క్లుప్తంగా

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): మండలం పరిధిలోని కేతనకొండ, కొటికలపూడి గ్రామాల్లోని ఆరు పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ ఉమాదేవి బుధవారం పరిశీలించారు. బూత్‌లలోని 100 మీటర్ల పరిధిలో సదుపాయాలు, భద్రత, అప్రోచ్ రోడ్లు, పరిశుభ్రతపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులకు సదుపాయాలపై పలు సూచనలు చేశారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో తరగతి గదులకు తాళాలు వేసి కార్యదర్శులు, బీఎల్‌ఓలు స్వాధీనం చేసుకున్నారు.

29 నుంచి వేసవి శిక్షణ కార్యక్రమాలు

తిరువూరు: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఈ నెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. చిత్రలేఖనం, కథలు చెప్పడం, యోగా, ధ్యానం, పుస్తక పఠనం, పేపర్ క్రాఫ్ట్, చదరంగం నేర్పించడం, క్రీడా శిక్షణ, స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు నేర్పడం, తేలిక పద్ధతుల్లో లెక్కలు నేర్పడం, సైన్స్‌పై అవగాహన, పుస్తక సమీక్ష తదితర అంశాలు శిక్షణలో ఉంటాయని చెప్పారు. విద్యార్థులకు ఆటపాటల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 27 నుంచి తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 91542 18236 నంబర్‌లో సంప్రదించాలని కోరారు

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



మునునూరు: పంచాయతీరాజ్ విభాగంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ చాగంటి పద్మావతిదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం, మునునూరు సచివాలయంలో ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాస్ అధ్యక్షతన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ సహాయకుడు సగ్గుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్ట్




తిరువూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురు వ్యక్తులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరువూరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీలలో ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాలో 40 తెలంగాణ మద్యం సీసాలను ద్విచక్ర వాహనంపై తిరిగి విక్రయిస్తున్న ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన రావుల కృష్ణను, విస్సన్నపేటలో 10 మద్యం సీసాలతో మిట్టపల్లి నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు.

బూత్ కమిటీలు సమన్వయంతో పనిచేయాలి

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయంలో భాగస్వాములు కావాలని జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో బూత్ కమిటీ సభ్యులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బూత్ కమిటీ సభ్యుల పాత్ర అత్యంత కీలకమన్నారు. బూత్ స్థాయిలో కష్టపడి పార్టీ విజయం కోసం పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. జేసీఎస్ మండల అధ్యక్షుడు కోసూరు వెంకటేష్, వివిధ గ్రామాల బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయి మనస్వికి అభినందన



నూజివీడు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఆకుల వెంకట నాగసాయి మనస్వికి ప్రైవేటు ఉద్యోగి వల్లకవి పద్మ శ్రీనివాసరావు బుధవారం ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఏలూరుకు చెందిన ఆయన నూజివీడులోని విద్యార్థిని ఇంటికి వెళ్లి సత్కరించడంతో పాటు ఆమె తల్లిదండ్రులను, మనస్విని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పెత్తందారులకు ఓటుతో బుద్ధి చెప్పండి

- వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు
- కొండపల్లిలో ఎన్నికల ప్రచారం



కొండపల్లిలో ప్రచారం చేస్తున్న తిరుపతిరావు, నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సామాన్యుడికి, పెత్తందారుడికి మధ్య జరుగుతున్న పోటీలో పెత్తందారుడికి ఓటుతో బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కోరారు. ఇప్పటి వరకు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా సంపాదించిన సంపాదనతో ఓట్లు కొనుగోలు చేసి గెలవాలని చూసే వారికి ప్రజా బలం ఏమిటో చూపాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కొండపల్లి మున్సిపాల్టీ 26, 27, 28 వార్డుల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక సత్తెమ్మ తల్లి ఆలయం, విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ప్రతి గడపకు వెళ్లి గడచిన ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ మరలా ఇంతకంటే మెరుగైన సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. జగనన్న ప్రభుత్వంలో మైలవరం నియోజకవర్గంలో సుమారు 25 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయగా, కొండపల్లి మున్సిపాల్టీలో 3,117 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీతో ప్రతి గ్రామ శివారులో మరో శాశ్వత గ్రామం ఏర్పడటం జగనన్న పుణ్యమే అని చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గతంలో సుమారు రూ.63 కోట్లు మంజూరు చేశారన్నారు. టెండర్ దశలో ఉండగా ఎన్నికల నియమావళి వచ్చిందని చెప్పారు. మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే టెండర్ దశ దాటి ఇంటింటి కుళాయి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆర్సీఎం కాలనీలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.75 లక్షలతో ఇంటింటి కుళాయి ఏర్పాటు జరిగిందన్నారు. పార్లమెంట్ అభ్యర్థి ఎంపీ కేశినేని నానికి, ఎమ్మెల్యే అభ్యర్థిగా కష్టాలు తెలిసిన వాడిగా తొలిసారి మీ ముందుకు వచ్చిన నాకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. స్థానిక వార్డు కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, మామిళ్లపల్లి చైతన్య స్రవంతి, బాడిశ నాగరాజకుమారి, పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, బట్టరాజ కార్పొరేషన్ డైరెక్టర్ పోరంకి పద్మావతి, ఎం.ఆనంద్, పోరంకి శ్రీనివాసరాజు, కె.నాగరాజు, బాలచందర్, ఎంఏ బేగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరుపతిరావు తరఫున ఆత్కూరు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సామాన్యుడినే గెలిపించాలి

జి.కొండూరు: వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును గెలిపించాలని కోరుతూ ఆయన తమ్ముడు సర్నాల స్వామి, కుమారుడు సర్నాల మణికంఠ జి.కొండూరు మండల పరిధి ఆత్కూరు గ్రామంలో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా సర్నాల తిరుపతిరావును, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతరాజు జయనాగవీణ, ఎంపీటీసీ సభ్యురాలు గార్లపాటి రమాదేవి, నాయకులు దొడ్డా విష్ణు, దుగ్గిరాల మల్లేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమంలో జగన్ ప్రభుత్వం ఆదర్శం

వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు

తిరువూరు: పార్టీ రహితంగా అందరికీ సంక్షేమ పథకాలను అమలు చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు పట్టణంలోని 1, 2, 3, 5, 6, 7 వార్డులలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్వామిదాసు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ రాష్ట్రంలోనూ అమలు జరగనన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అందించిందని చెప్పారు. తిరువూరు నియోజకవర్గానికి స్థానికుడినైన తనకు ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, తాను గెలిచిన వెంటనే నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సాగు, తాగునీటి సరఫరాకు తొలి ప్రాధాన్యత ఇస్తామని, ఇతర సమస్యలను సైతం పరిష్కరిస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్ వెలుగోటి విజయలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, రామవరపు మంజుల, పర్సా శ్రీనివాసరావు, పసుపులేటి చంద్రశేఖర్, కొలికపోగు నిర్మల, పరసా సత్యనారాయణ, మోదుగు ప్రసాద్, ఏరువ ప్రకాష్‌రెడ్డి, షేక్ నదియా, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలశెట్టి వేణుబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, కాలసాని గోపాల నాగేశ్వరరావు, గత్తం నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తిరువూరులో జెండాచెట్టు వద్ద ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న స్వామిదాసు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఓటమి భయంతోనే వసంత బెదిరింపులు

- పచ్చని కుటుంబాల్లో చిచ్చుపెట్టిన కృష్ణప్రసాద్
- రైతు సంఘం నేత పోతురాజు ఆగ్రహం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మైలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు గెలుపు తథ్యమని గ్రహించిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ పచ్చని కుటుంబాల్లో అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టి విడదీస్తున్నాడని వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు గొట్టిముక్కల పోతురాజు ఆరోపించారు. వసంత కృష్ణప్రసాద్ తన ఇంటి వద్ద చేసిన హంగామాపై బుధవారం ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటీవలి కాలంలో ఎంపీ కేశినేని నాని, తిరుపతిరావు పర్యటనల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌పై అవినీతి ఆరోపణలు చేసిన నన్ను టార్గెట్ చేశారన్నారు. తన సోదరుడు వెంకయ్యను ప్రలోభాలకు గురిచేసి తన ఇంటి వద్ద వసంత కృష్ణ ప్రసాద్‌తో పాటు టీడీపీ నాయకులు హంగామా సృష్టించి కవ్వింపు చర్యలకు దిగడంపై మండిపడ్డారు. జూన్ 4 వ తేదీ తర్వాత మేమేంటో చూపిస్తామని నన్ను బెదిరిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే పదవి కోసం ఇంత నీచమైన స్థితికి దిగజారడం వసంతకే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఇటువంటి ఉడత ఊపులకు బెదిరేది లేదని స్పష్టం చేశారు. సర్నాల తిరుపతిరావు విజయం కోసం అహర్నిశలు కష్టపడి గెలిపిస్తామన్నారు.

కాపులకు అండగా జగన్ ప్రభుత్వం



ఉమ్మారెడ్డిని సత్కరిస్తున్న నరహరిశెట్టి శ్రీహరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో కాపులకు అండగా ఉందని శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నరహరిశెట్టి శ్రీహరి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును ఆయన కార్యాలయంలో కలిసి ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా నరహరిశెట్టి శ్రీహరి ఉమ్మారెడ్డిని సత్కరించారు. అనంతరం ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు శ్రీహరిని సత్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాపులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసినంత మేలు మరి ఏ ప్రభుత్వంలోనూ జరగలేదన్నారు. రానున్న ఎన్నికల్లోనూ అత్యధిక సీట్లు కాపులకు కేటాయించి గౌరవించారని వివరించారు. తనకు పదవి రావడంలో కృషి చేసిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

స్వామిదాసుకు మద్దతుగా సుధారాణి ప్రచారం



ప్రచారంలో భాగంగా తోపుడుబండిపై గారెలు వేస్తున్న సుధారాణి

తిరువూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసుకు మద్దతుగా ఆయన సతీమణి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి తిరువూరు నగర పంచాయతీలోని 17వ వార్డులో బుధవారం ప్రచారం నిర్వహించారు. వార్డులోని మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిపై ఆరా తీశారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చేందుకు మహిళలంతా అండగా నిలవాలని, తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసును, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా తోపుడు బండి నిర్వాహకులను ఓట్లు అభ్యర్థించిన సుధారాణి కొద్దిసేపు తోపుడు బండిపై గారెలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్, నల్లబోతుల సీతారావమ్మ, కుంచం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులూ.. తస్మాత్ జాగ్రత్త!

- వేసవిలో పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఎస్ఐ పి. వాసు

మునునూరు: వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ, జాగ్రత్త వహించాలని ఎస్ఐ పి.వాసు అన్నారు. వేసవిలో పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళా పోలీసులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ చిన్నారులను చెరువులు, బావులు, కాలువల్లో ఈతకు పంపరాదని చెప్పారు. తమ్మిలేరు పరీవాహక గ్రామాల చిన్నారులు, యువకులు పలువురు ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డారని, అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని చెప్పారు. పిల్లలకు మోటార్ బైక్‌లను ఇచ్చి రహదారి ప్రమాదాలకు కారకులు కావద్దన్నారు. మైనర్ల డ్రైవింగ్‌ను, ట్రిపుల్ రైడింగ్‌ను సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండుటెండల దృష్ట్యా చిన్నారులను బయటకు పంపకుండా ఇళ్లల్లోనే ఉంచి వడదెబ్బ బారిన పడకుండా కాపాడాలని చెప్పారు. సెల్‌ఫోన్లు చేతికి ఇవ్వకుండా సాధ్యమైనంత వరకు నీతి పుస్తకాలు, పంచతంత్ర కథలు, మర్యాద రామన్న తీర్పులు, పరమానందయ్య శిష్యుల కథలు వంటి వినోదం పంచే పుస్తక పఠనం అలవాటు చేయాలని సూచించారు. వీటిపై మహిళా పోలీసులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

చందన అలంకరణలో మారెమ్మ అమ్మవారు



విస్సన్నపేట: మండల పరిధి పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో వార్షిక తిరునాళ్ల మహోత్సవం వైభవంగా జరుగుతోంది. బుధవారం రెండో రోజున అమ్మవారిని చందన లేపనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రాత్రికి ప్రభ బండిపై అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ఈఓ వై. సీతారామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తిరువూరులో 8 నామినేషన్లు దాఖలు



తిరువూరులో నామినేషన్ సమర్పించిన భారత్ చైతన్య యువజన పార్టీ అభ్యర్థి వెంకటేశ్వరరావు

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా లాం తాంతియాకుమారి, భారత్ చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా చిలపరపు వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులుగా కోట పుల్లమ్మ, వాసం మెహర్‌బాబా, శ్రీకాకుళపు వెంకట్రావు, కొలికపోగు వెంకట్రావు, కొర్లపాటి రవీంద్రబాబు, కోటమర్తి కృష్ణయ్య తమ నామినేషన్ పత్రాలను తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. మాధవికి సమర్పించారు.

నూజివీడులో నామినేషన్ల దాఖలు

నూజివీడు: నూజివీడు నియోజకవర్గం నుంచి పలువురు అభ్యర్థులు బుధవారం తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై.భవానీశంకరికి అందజేశారు. టీడీపీ నుంచి కొలుసు పార్థసారథి, కాంగ్రెస్ నుంచి మరీదు కృష్ణ, బహుజన సమాజ్ పార్టీ నుంచి సీహెచ్ వెంకటేష్ తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

మైలవరంలో ఐదు నామినేషన్లు..

మైలవరం: మైలవరం అసెంబ్లీ ఎన్నికలకు బుధవారం ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్‌లు దాఖలు చేశారు. మైలవరం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నంకు చెందిన ముప్పసాని భూలక్ష్మి భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా తమ నామినేషన్ దాఖలు చేశారు. జి.కొండూరుకు చెందిన పులిపాక ప్రకాష్, మైలవరం మండలం చంద్రగూడెంకు చెందిన ప్రత్తి సాయి దాశరధి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ తరఫున ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా భూక్యా కోటేశ్వరరావు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు.

మలేరియా రహిత సమాజానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 2027 నాటికి మలేరియా రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 25వ తేదీ వరల్డ్ మలేరియా డేను పురస్కరించుకుని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు మాట్లాడుతూ మలేరియా వ్యాధి వచ్చిన తర్వాత కంటే ముందుగా నివారించడం మనందరి ప్రధాన లక్ష్యమన్నారు. 2027కి మలేరియా కేసులు లేకుండా చేసుకోవడంతో పాటు 2030 నాటికి మనదేశంలో మలేరియా కేసులు నిర్మూలించడమే లక్ష్యమన్నారు. మలేరియా నివారణ కోసం పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడటంతో పాటు దోమల లార్వా వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. దోమల లార్వా నిర్మూలన కోసం పెద్ద ఎత్తున సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించడంతో పాటు శివారు ప్రాంతాల్లో నివసించే వారు దోమ తెరలు వాడుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వెలగలేరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి, డాక్టర్ సుమ బజాజ్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి సూర్యనాయక్, సబ్ యూనిట్ అధికారులు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాంతియాకుమారికి రూ.12 లక్షల అప్పులు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న లాం తాంతియాకుమారి తన నామినేషన్ పత్రాలతో పాటు ఆస్తులు, అప్పుల వివరాలతో కూడిన అఫిడవిట్ సమర్పించారు. తన వార్షికాదాయం రూ.5 లక్షలుగా అఫిడవిట్‌లో చూపారు. బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు, బంగారు, వెండి ఆభరణాల విలువ రూ.19.80 లక్షలు, స్థిరాస్తి రూ.1.93 కోట్ల విలువైనవి ఉన్నట్లు తాంతియాకుమారి ప్రకటించారు. బ్యాంకులు, సహకార సంఘాల్లో రూ.12 లక్షల మేర అప్పులున్నాయని, తనపై కేసులు ఏవీ లేవని వివరించారు.

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సమరం, నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కళాశాల కార్యదర్శి శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఓటు అవగాహనా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సమరం మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన దేశం భారతదేశమన్నారు. 144 కోట్ల జనాభా కలిగిన దేశంలో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రక్రియను నిర్వహించి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వాన్ని ఎన్నుకోవటం ఈ దేశం గొప్పతనమన్నారు. అటువంటి భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది వంటిదని చెప్పారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవటం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి, స్వీప్ నోడల్ ఆఫీసర్ యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో నిర్లిప్తతను తొలగించి ఓటింగ్ శాతాన్ని పెంచడంలో విస్తృత ప్రజా భాగస్వామ్యం అవసరమన్నారు. పవిత్రమైన ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటరుకు సమస్త సమాచారంతో క్యూఆర్ కోడ్ ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ (వీఐఎస్) అందిస్తారన్నారు. తొలుత ర్యాలీని కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు ప్రారంభించారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎల్ఎస్ రెడ్డి, నగరపాలకసంస్థ అడిషనల్ కమిషనర్ కీర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, కల్మాబేగం తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



ఆగిరిపల్లిలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ఆగిరిపల్లి: మండలంలోని ప్రజలు ఎండలతో అల్లాడిపోతున్నారు. బుధవారం ఆగిరిపల్లిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే గ్రీష్మతాపం ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు ఎండ కొనసాగుతుండడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే హడలి పోతున్నారు. వృద్ధులు, పిల్లలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



చాట్రాయి: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య సిబ్బందికి సూచించారు. మండలంలోని కృష్ణారావుపాలెం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలను ఆయన పరిశీలించారు. లక్ష్మయ్య మాట్లాడుతూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం చెక్‌పోస్టు సిబ్బందికి మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎ.కొండూరు: మండలంలోని రేపూడి తండాకు చెందిన వి. వెంకటేశ్వరరావు గృహం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల యూత్ నాయకులు చెన్నారావు బాధిత కుటుంబానికి రూ. ఐదు వేలను బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి. చంటి, ఎంపీటీసీ బి. కేసియా పాల్గొన్నారు.

జక్కంపూడి కాలనీలో పోలీసుల కవాతు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో బుధవారం కేంద్ర అదనపు బలగాలు, విజయవాడ సిటీ పోలీసులు కవాతు నిర్వహించారు. కాలనీలోని పలు ప్రాంతాల్లో సాగిన కవాతులో కొత్తపేట సీఐ గణేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సంఘ విద్రోహ శక్తులను నిర్మూలించే దిశగా, ప్రజలకు అవసరమైన ధైర్యాన్ని ఇచ్చి, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ నుంచి ప్రారంభమైన కవాతు ప్రధాన వీధులలో సాగింది.